### కోరికతో ప్రారంభమై సత్యాగ్రహంతో సతమతమై కులుకులతో ముగిసింది!

# మా ఆవిడ గొలుసు ముచ్చట

గృహకలహాలకు సైన్సు చేసే సహాయం ● 'రావూజీ'

"అయితే, నీధోరణి నీదేనా? నామాట లేమైనా లెక్కపెడతావా? ఈరోజుల్లో, నీలాంటి నవనాగరికులు నగలే నిషేధించుతూ ఉంటే, నగలు నగలంటావేమిటి నువ్వు? ఇప్పటివాళ్ళు నగ లెక్కువ వేసికోకూడదనీ, వేసికొంటే మోటుగా ఉంటుందనీ; తమ కోమలమైన శరీరము ఎక్కడ కందిపోతుందోననీ, నామకా ఒక్కపేట గొలుసు, లంబాడీవారిలాగ చారిడేసి లోలకులు, చక్కటిచీర, చేతికొక రిస్టువాచీ, కాళ్లకి జోడు, కంటికి జోడు ఇవే ఫేషన్ అంటూ, తక్కినవన్నీ దిగతుడిచి పారవేస్తున్నారే! అలాంటప్పుడు, నక్కనుజూచి పులి వాతపెట్టికొన్నట్లు, ఎవరినో జూచి నీవు మొదలెట్టావేమిటి? బాగానే వుంది. డబ్బులేని రోజుల్లో తిండికే దిక్కులేక ప్రజలు మలమల మాడుతూంటే, నగలు నగలంటావేమిటి? ఇప్పుడు నాల్గురాళ్ళు నిల్వచేసికొంటే, తర్వాత చూసికొన వచ్చును. పద, భోజనానికి పోదాం" అంటూ ఆరోజుకి తప్పించుకొన్నాను.

చూశారూ! ఇంతకీ రహస్య మేమిటంటే, నేను కొంచెం లోభివానిని. డబ్బు గణించడమందే గాని, ఖర్చుపెట్టటంలో అరంత ప్రవేశమూ లేదు, ప్రావీణ్యమూ లేదు. అట్టే పిచ్చిపిచ్చి సరదాలు లేవు.

... ... ...

ఆ మరునాడు సాయంత్రమైంది. సత్య హరిశ్చంద్రునిలాగ తనమాట జవదాటకుండ ప్రక్కింటావిడ గొలుసుతో తయారైంది మా భామ.

"దీనికి, మరపులేదురా, భగవంతుడా!" అనుకొన్నాను.

- చేతిలో పెట్టి "ఏమంటారూ? బాగుందా లేదా? ఏమండీ, యిదొక్కటైనా చేయించి నాముద్దుముచ్చటలు తీర్చండీ! ఎంతోలేదు. పది కాసులు పట్టిందిట, బంగారం. రేపు కంసాలి దగ్గరకు తీసికెళ్ళి, మచ్చుచూపించి, మజూరీ బేరమాడి, పదిరోజుల్లో యిమ్మనండీ" అంటూ పురమాయించింది.

"ఏదో చెప్పుతావ్. నీకేం? డబ్బిచ్చుకొనే వాణ్ణి నేను. దాని కష్టనష్టములు నీకేమి తెలుసు? నేనూ చెబుతాను కబుర్లు, తిని కూర్చొని. ఏమిటో నగంటావు. విన్నావా ఈ సంగతి? ఆ బంగాళా దేశంలో తిండిలేక మలమలమాడి ఎంత మంది చచ్చారో? సరేలే చూద్దాం" అని ఆ రాత్రి గడిపాను.

... ... ...

ఆ మరుసటిరోజు సాయంత్రం ఆఫీసునుంచి వచ్చి, వేషం తీశానో, లేదో "ఏమండీ! మజూరీ ఎంతడిగినాడు కంసాలి?" అంటూ మొదలెట్టింది.

"సరే లెద్దూ! ఏది పట్టుకొంటే అది పిండి, పిప్పిచేసేదాకా, ఊరుకోవు. నా పనితొందరలో నేనున్నాను. నే నెక్కడికీ వెళ్ళలేదు" అంటూ రెండు కేకలు వేశాను.

"పోనీలెండీ! అడగక, అడగక యిదైనా చేయించమని అడిగాను. దీనికే అంతకష్టమా!" అంటూ మూతి తిప్పుకొంటూ, మొగం ముడిచి చురచుర లోపలికి పోయింది. నా మొఖానికి ఫలహారమూ లేదు, కాఫీ లేదు!

ఆ రాత్రి యెంతసేపైనా భోజనానికి పిల్వదే. ఇలా కాదని, నేనే కంచం, మంచినీళ్ళు పెట్టుకొని కూర్చున్నాను. చురచుర, చర చర తిరిగింది రెండుమూడుసార్లు వంటింటికి, భోజనాల సావిడికీ మధ్య. కాస్త సాంబారు, మజ్జిగ నీళ్లు, రెండూ రెండు తండిగిన్నెల్లో పారేసి, అన్నం వడ్డించి, గదిలో దూరింది. "ఈవేళ కింతేరా బాబూ" అని అనుకొంటూ, మారు మాటాడక, ఆ రాత్రికి మంచినీళ్ళతో పొట్టనింపుకొని, కాసేపు చదువు సాగించి, పరుపు నంటుకొని పడుకొన్నాను. ఇల్లంతా సర్దుకొని, తిమ్మడపల్లే, పడుకొంది మా ఆవిడ.

... ... ...

ప్రొద్దున్న పదకొండు గంటలైంది. ఆఫీసు వేళైపోయింది. ఎంతకూ పిండాకూడు పెట్టదే! "వంట అయిందా?" అంటే అవలేదనే జవాబు. పైగా, "నేనేమి చెయ్యనూ! కర్రలు తడిసినవి పట్టుకొచ్చాడు జవాను గవరయ్య. నా కళ్ళూ, నోళ్ళూ మంటలేగాని, మండిచావవు" అంటూ సాగతీసికొంటూ మాటలు.

ఎలాగైతే, ముద్ద కంచంలోకి వచ్చేటప్పటికి, పన్నెండుగంటలైంది. మళ్ళీ ఆ సాంబారు, మజ్జిగ నీళ్ళే! ఆదరబాదర తిని పరుగెత్తాను ఆఫీసుకి. ఎక్కడ అధికార్లనుంచి మాటవస్తుందోనని నాకు భయం. వెళ్ళగానే, దొర క్యాంపుకు వెళ్ళినాడని జవాను చెప్పాడు. "బ్రతుకు జీవుడా!" అనుకొన్నాను.

... ... ...

సాయంత్రమైంది. మెల్లిగా యింటికి చేరుకొన్నాను. "కాఫీ ఏదే?" అని అడిగాను. "నేనేమి చేయనూ? పాలు విరిగిపోయినాయ్, నేనూ త్రాగలేదు. తలనొప్పి వచ్చింది. ఈ వేళ వంట చేయలేను. హోటలునుంచి 'కారియర్' తెప్పించుకోండి" అంటూ సణిగింది.

మరునాడు కూడా ఆఫీసుకి పన్నెండుగంటలకు పంపుతుందేమో నని, ప్రొద్దుకన్నే ఎండిన కర్రలు మంచివి చూసి తెమ్మని గవరయ్యకు డబ్బిచ్చి, వంటవేళకు తెప్పించాను. తెప్పించిన లాభమేమిటీ? పదకొండుగంటలదాకా పొయ్యిలో నిప్పేయక అప్పుడు బియ్యం లేవంది.

ఇలాగ వారంరోజులు, రోజూ ఉప్పంటే పప్పులేదని, పప్పంటే ఉప్పులేదని, చివరకు తిండికికూడ వాచిపోయేలాగు చేసేసింది. ఆనాడు పారిజాతకుసుమానికై కినిసిన సత్యభామ, ఆమెచేత తన్నులుతిన్న కృష్ణభగవానుడు ఇప్పుడు నా ప్రేమోల ప్రత్యక్షమైనారు. కాని, యింకా ఆ తన్నులయోగంమాత్రం నాకు పట్టలేదు.

... ... ...

గడియారం 5-30 గంటలు కొట్టింది. ఆఫీసు వదిలాను. అసలు కాసెంతో, మజూరీయెంతో తెలిసికొందామని బజారుకేసి వెళ్లాను. గాజుబీరువాల్లో ధగ ధగ మెరసిపోతున్నాయి వెండి సామాన్లు. కొట్టుముందు 'స్మిత్ అండ్ సన్స్' డీలర్స్ ఇన్ సిల్వర్ వేర్స్, అండ్ గోల్డు' అని వ్రాసిన బల్ల కనపడింది. కొట్లో పాదం పెట్టినానో లేదో "రండి, బాబూ; రండి" అంటూ కుర్చీ చూపించాడు అంగడివాడు. మెల్లిగా కాసు యాభై యెనిమిది రూపాయలని తేల్చాడు.

"ఎలాగా మనకి, ఐదు ఆరు పెద్ద నోట్లు వదలక తప్పదురా, బాబూ!" అనుకొన్నాను. కొట్లో యింకా ఏమైనా వింతవస్తువులున్నాయేమోనని, నాలుగువైపులకు దృష్టి పరికించాను. అదృష్టవశాత్తు 'షోకి' పెట్టిన బంగారు గొలుసులు కనపడ్డాయి. "ఎంతండీ, యీ గొలుసులు?" అని అడిగాను. "వాటి వెల. పదిహేను రూపాయలు, బాబూ! బంగారంతో చేసినవిగావు. అయినప్పటికీ, రోల్డు గోల్డని అంత గ్రహించలేరు ఎవ్వరు. పదేండ్లు గ్యారంటీ" అన్నాడు. "బాగుందిరా, బాగుంది! దీనితో మన మొకనాటకమాడ వచ్చును," అని ఆలోచించుకొని; వెంటనే పగిహేను రూపాయిలూ చెల్లించి, చక్కని 'డిజైన్'ది తీసికొని యింటికి చేరాను. మెల్లిగా మా ఆవిడ కంటబడకుండా, తోలుపెట్టెలో పెట్టి, తాళముబిగించాను.

ఇంక మేడక్రింద మా ఆవిడ, రోగమంటూ చాపమీద శయనించింది. మాటా లేదూ, మంతీ లేదు. మెల్లిగా దగ్గర చేరాను. "అయితే, ఏమిటీ బిగింపు? ఏదో మెల్లిగా చేయిస్తానంటే, ఊరి ఉత్తరాయణంలాగు, 'చేయిస్తావా, చస్తావా' అంటూ కూర్చున్నావ్, మెల్లిగా ధరలు తగ్గినాక చేయిస్తానన్నాను గాని, నేను చేయించనన్నానా? పరిస్థితులు చల్లబడ్డాక చేయించవచ్చుననుకొంటే వినక వారంరోజులునుంచి యింకోపనిమీదకు బుర్ర పోనీయవ్. నిన్న కంసాలి దగ్గరకెళ్లాను, నీ పోరు పడలేక. కాసు యాభై యెనిమిది రూపాయలట. పదికాసులు పడుతుందిట—నాల్గు పేటలకి, ఇంతకన్న 'ఫేషనబుల్' చేస్తానంటూ మచ్చు పుస్తకం చూపించాడు. అందులో ఒక మాదిరిది చాలాబాగుంది. అదిచేయమనిచెప్పి పురమాయించివచ్చాను. పదిరోజుల్లో యిస్తాడట." అంటూ చెప్పేటప్పటికి మా ఆవిడ కోపం కొంచెం తగ్గినట్టు కనపడింది.

...       ...       ...

పదిరోజులైంది, చడీ చప్పుడూ కాకుండా తోలుపెట్టిలోని రోల్డుగోల్డు గొల్సు తీసి, "ఇదిగో బాబూ! పట్టింది పల్లార్చితేగాని ఊరుకోవ్" అంటూ చేతిలో పెట్టాను. మొగం విప్పారింది. "బాగుం"దని ఒక 'టెస్టిమోనియల్' పారేసింది నా మొఖాన్ని.

పాపం! నిజంగానే చేయించి తీసికొచ్చాననుకొంది. అయితే, నేను ఎంతైనా మోసం చేశానన్న 'గిల్టీకాన్షన్స్‌ఫీల్' అయినా నంటారేమిటి? లేదు. ఈ లాంటి పెంకి మనుష్యులకు యిదే మంచి మందు. నిజంగా శాస్త్రమే 'డెవలప్'గాక, యీ రోల్డుగోల్డు 'మెథడ్స్'లోకం అవలంబించకపోతే, యీలాంటి నవీన స్త్రీలను కట్టుకొన్న కొంపలన్నీ నరకకూపములే!

ఇంక చూడండి ఆ మరునాడు. సాయంత్రం వచ్చాను యింటికి. అ ఒయ్యారపు నడకలూ, ఆ ముసి ముసి నవ్వులూ, ఆ 'ఫేస్ పౌడర్' కోటింగులూ, యేమిచెప్పనూ? వెండి పళ్లెంలో ఒక 'స్వీట్' ఒక 'హాట్'తో కాఫీ సమేతంగా తయారైంది రంభలాగ. సరే- నే కొన్న గొలుసు కనపడేలాగ వేసికొందని వేరే చెప్పాలంటారేమిటి?

"ఔరా! ఎంతకు లేరు కాంతలు" అని అనుకొన్నాను.


## ఉబ్బసముతో బాధపడువారికి సలహా ఇదే



"తాత్కాలికంగా ఉపశమనము కలిగించే మందులను వాడడం చాలా వెఱ్ఱితనం."

అప్పటికప్పుడు వెంటనే గుణమిచ్చుటయే గాక, ఉబ్బస వ్యాధియొక్క మూలకారణములను రూపుమాపి శాశ్వతంగా నయము చేయునది పురోహిత్‌వారి శ్వాసహారి మాత్రమే. శ్వాసహారిని వాడుట ప్రారంభించిన వెంటనే, దగ్గుపోయి, శ్వాస ధారాళమగుటయేగాక, జీర్ణకోశము, ఊపిరితిత్తులు క్రమేణ బలపడి, ఉబ్బసము పూర్తిగా తగ్గిపోవును.

ఉబ్బసము, ఊపిరి సలుపకుండుట, నడుము నొప్పి, గొంతుకలో నసకలిగించు దగ్గు, మొదలగు గుండెజబ్బులకు శ్వాసహారి (నీలిరంగు ప్యాకెట్టు)ను వాడుడు. మలబద్ధకము, పులితేపులు, వీటికి బాధపడు ఉబ్బస వ్యాధి గ్రస్తులగువారు శ్వాసహారి కాంపౌండు (ఎరుపురంగు ప్యాకెట్టు)ను వాడుడు.

అందరు కెమిస్టులవద్దను, 3, 6, 12 ఔన్సుల సైజులలో, రు 3-6-0, 5-12-0, 10-0-0 లు ధరలు గలిగినవి లభించును.

మద్రాసు స్టాకిస్టులు :

మెస్సర్సు: అప్పా & కో, చైనాబజారోడ్
,, శ్రీ క్రిష్ణన్ బ్రదర్స్, తంబుచెట్టివీధి,
,, అమృత రత్నాకర ఫార్మసి,
గోవిందప్పనాయక్ వీధి

తయారుచేయువారు :

పురోహిత్ ఫార్మసీ,
కొల్హాపూరు.



PUROHIT
SHWAS-HARI